
# సాక్షి గుంటూరు

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024




### ప్రద్యుమ్న రక్తదానం

లబ్బీపేట(విజయవాడ): రాష్ట్ర రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న శనివారం రక్తదానం చేశారు. విజయవాడ గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకును సందర్శించారు.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 505.40 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

### నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6200, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

## న్యూస్‌రీల్

### ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయండి

**వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ**

**చేబ్రోలు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 29వ తేదీన పొన్నూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారని, సభలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భం అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ 29వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే సభకు చేబ్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా రానున్న ఐదేళ్ల కాలంలో ప్రతి ఒక్కరి జీవితం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా ఎన్నికల విధులు

**జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి**



**గుంటూరు వెస్ట్:** త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల విధులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు నీరజ్ కుమార్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌ఐసీ ద్వారా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 13,800 మంది సిబ్బందిని నియమించామన్నారు. కేంద్ర బలగాలు కాకుండా 2300 పీఓలు, 2300 ఏపీఓలు, ఓపీఓలుగా 9200 మందిని నియమించామన్నారు. అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ జి.రాజకుమారి, ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్‌ఓ పెద్ది రోజా, ఎన్‌ఐసీ డీఐఓ బిమల్ కుమార్ పాల్గొన్నారు.

### అతివలదే అగ్రస్థానం

**జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 17,91,543 మంది**

**గుంటూరు వెస్ట్:** రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా శనివారం రాత్రి ఓటర్ల జాబితా విడుదల చేసింది. వాస్తవానికి ఈఏడాది జనవరి 22న స్పెషల్ సమ్మరి రివిజన్–2024లో భాగంగా విడుదల చేసిన ఓటర్ల కంటే అధికంగా ఉన్నారు. 19,521 మంది అదనంగా నమోదయ్యారు. ఈనెల 15 వరకు స్వీకరించిన ఓటరు దరఖాస్తు ఫారం పరిశీలించి వివరాలు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మహిళ ఓటర్లు 9,26,007 మంది ఉండగా, పురుష ఓటర్లు 8,65,377 మంది ఉన్నారు. ట్రాన్స్‌జండర్స్ 159 మంది ఉన్నారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| తాడికొండ | 2,07,615 |
| మంగళగిరి | 2,92,432 |
| పొన్నూరు | 2,27,135 |
| తెనాలి | 2,67,624 |
| ప్రత్తిపాడు | 2,67,888 |
| గుంటూరు వెస్ట్ | 2,78,158 |
| గుంటూరు ఈస్ట్ | 2,50,691 |
| **మొత్తం** | **17,91,543** |

### నిత్యాన్నదానానికి విరాళం



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నూజివీడుకు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. నూజివీడుకు చెందిన ఎస్‌వీపీఎస్ ఎంటర్‌ప్రైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి కుటుంబం ఆలయ అధికారులను కలిసి రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

# జగనన్న సంక్షేమ సంతకం

**మేనిఫెస్టో అంటే** పార్టీ ఆశయాలు, ఆదర్శాలకు నిర్వచనం. ప్రజా సంక్షేమానికి, ప్రగతి పథానికి నిర్వచనం. దాన్ని పవిత్ర గ్రంథంలా భావించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని 99 శాతం పైగా అమలు చేశారు. చెప్పాడంటే..చేస్తాడంతే అనే మాటను అక్షరాలా రుజువు చేశారు. ప్రజలంతా సంక్షేమ వరాల జల్లులో తడిసిపోయారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రాచబాట పట్టింది. నాడు–నేడుతో ప్రభుత్వ బడులు గుడుల్లా మారాయి. జగనన్న సురక్షతో వైద్యం ఇంటి బాట పట్టింది. రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయం పండుగలా మారింది. బిడ్డ చదువుకు అమ్మఒడి సాయం అందింది. అదే సంక్షేమాన్ని ఆలంబనగా చేసుకుని, అదే ఉత్సాహంతో, అదే ధైర్యంలో నేడు మేనిఫెస్టోను విడుదల చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా నవరత్నాలకు మెరుగులు దిద్ది రాష్ట్రంపై చెరగని సంక్షేమ సంతకం చేశారు.

### రైతులకు మరింత భరోసా



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పడు. గతంలో మాట ఇచ్చిన విధంగానే ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పంటల సాగుకు పెట్టుబడుల సమయానికి నేరుగా రైతుల ఖాతాలకు పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా కింద రూ. 13,500 ఇచ్చారు. తాజాగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఆ మొత్తాన్ని రూ. 16 వేలకు పెంచారు. ఇది రైతులకు మరింత భరోసానిస్తుంది. రైతులను ఆదుకునే రైతు పక్షపాత ప్రభుత్వమిది. అన్నదాతలందరు సీఎం జగన్‌కు అండగా ఉంటాం.

– మామిళ్లపల్లి ఆంజనేయులు
రైతు, ప్రత్తిపాడు

### పెట్టుబడులకు దిగులు లేకుండా..



గతంలో రైతులు పెట్టుబడుల సమయం వస్తే డబ్బుల కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఆ సమస్య చాలా వరకు తగ్గింది. వ్యవసాయసీజన్ ఆరంభమయ్యే సమయానికి రైతు భరోసా ద్వారా పెటుట్బడి సాయాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు పెంచిన ఈ మొత్తం రైతుకు పెట్టుబడులకు చేతికొస్తాయి. రైతాంగం కోసం ఇంత చిత్తశుద్ధితో పథకాలను అమలు చేసిన నాయకులను ఇప్పటివరకు చూడలేదు.

– భట్టిపాటి శ్రీనివాసరావు
రైతు, ప్రత్తిపాడు

### మేనిఫెస్టో మాకు ఓ పవిత్ర గ్రంథం

- దేశ చరిత్రలోనే విశ్వసనీయత ఉన్న నాయకుడు జగనన్న
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



**పట్నంబజారు:** గత ఎన్నికలకు ముందు ఏ హామీలైతే సీఎం వైఎస్ జగన్ ఇచ్చారో.. అది కారంలోకి వచ్చాక ఆ హామీలన్నీ నెరవేర్చి చరిత్ర సృష్టించారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోపై శనివారం ఆమె స్పందించారు. దేశ చరిత్రలోనే విశ్వసనీయత ఉన్న నాయకుడు వైఎస్ జగనన్న అని స్పష్టం చేశారు. ఎంతవరకు చేయగలమో అంతే చెప్పే దమ్ము, ధైర్యం వైఎస్సార్ సీపీకే ఉన్నాయని వివరించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతంపైగా అమలు చేసి రికార్డు సృష్టించామని తెలిపారు. గత ఎన్నికల హామీలనే ఇప్పుడు మళ్లీ ప్రకటిస్తూ కొత్త మేనిఫెస్టో విడుదల చేయడం హర్షణీయం అని చెప్పారు. నవరత్నాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు. మహిళాభ్యున్నతి, సమాజాభివృద్ధి నవరత్నాలు ద్వారా సాధ్యమయ్యాయని వివరించారు. చంద్రబాబునాయుడు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు ఇస్తున్నా సరే.. జగనన్న మాత్రం చేయగలిగే పథకాలనే సూటిగా ప్రకటించారన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ఎలాగూ నెరవేర్చరనే విషయం ప్రజలకు బాగా తెలుసని చెప్పారు. అమ్మ ఒడిని ఏటా రూ.17 వేలకు పెంచడం ద్వారా తల్లులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతు భరోసా ద్వారా ఇస్తున్న ఆర్థిక సాయాన్ని కూడా ఏకంగా ఏటా రూ.16 వేలకు పెంచి అన్నదాతలకు ఎంతో మేలు చేశారని చెప్పారు. గొప్ప ప్రభుత్వాన్ని మరోసారి దీవించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ తిరిగి మరోసారి గెలిచి మేనిఫెస్టోలోని అన్ని హామీలు నెరవేరుస్తామని స్పష్టం చేశారు.

### 'సంక్షేమ' మార్గదర్శకుడు జగనన్న



భారతదేశంలో సంక్షేమ పథకాల మార్గదర్శకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. 2019లో నవరత్నాలు పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేశారు. ఇప్పుడు 2024లో నవరత్నాలకు కొన్ని మార్పులు చేసి కొత్త మేనిఫెస్టోను విడుదల చేశారు. జగనన్న ఏదైతే చెబుతారో అదే చేస్తారు. ఎన్ని కష్టాలు వచ్చినా అమలు చేసి తీరుతారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదు. పెట్టుబడులు రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా విపత్తును సైతం అధిగమించి రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకువచ్చారు. మేనిఫోస్టో ద్వారా గతంలో కంటే అధికంగా పేదలకు లబ్ధి జరుగుతుంది. పేద, మధ్య తరగతి వర్గాల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగు పడుతుంది.

– మురుగుడు లావణ్య,
వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి



### ప్రతిపక్షాలకు వణుకు పుట్టించేలా..



ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టించేలా.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ఉంది. మేనిఫెస్టోను చూసి టీడీపీ, జనసేన నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తి ఉంటాయి. టీడీపీ హయాంలో రూ.వెయ్యి మాత్రమే ఉన్న పింఛన్‌ను రూ.3వేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుంది., తిరిగి ఆ పింఛన్‌ను రూ 3,500 చేస్తున్నారు.

–నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు అభ్యర్థి

### ప్రపంచ దేశాలు చూపు ఏపీ వైపు..



ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం చదువులను అందుబాటులోకి తెచ్చారు. నాడు–నేడుతో అభివృద్ధి పర్చడంతో పాటు పైసా ఖర్చు లేని ఉచిత విద్యను అందించిన మహానుభావుడు వైఎస్ జగన్. ఐఎఫ్‌పీలు, ట్యాబ్స్ ద్వారా అందిస్తున్న విద్యాబోధనతో ప్రపంచ దేశాలు ఏపీ వైపు చూస్తున్నాయి. ఇది పేదలకు మేలు చేసే మేనిఫెస్టో.

– డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరబాబు, ప్రముఖ సామాజికవేత్త, ఇద్వా వ్యవస్థాపకుడు, గుంటూరు






ప్రతిజ్ఞ చేస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ, జేసీ, యువత

# ఉత్సాహంగా 'ఓటేద్దాం'

- లెట్స్ ఓట్ 3 కే వాక్‌లో యువత సందడి
- జెండా ఊపి ప్రారంభించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్

**గుంటూరు వెస్ట్:** రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం, లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థతో కలిసి శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో యువ ఓటర్ల కోసం 3కే వాక్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మాట్లాడుతూ 18–19 ఏళ్ల మధ్య ఉన్న యువత రాష్ట్రంలో అధికశాతం ఓటర్లుగా నమోదయ్యారన్నారు. రాష్ట్రంలో 18 అర్బన్ నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉందన్నారు. దీనిని పెంచేందుకు అనేక మార్గాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. మే 13న అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తొలిసారి ఓటు హక్కు సాధించిన యువతతో సహా మిగతా అందరూ ఓటు వేయడం ద్వారా ఇతరుల్లో స్ఫూర్తి నింపాలని కోరారు. ప్రపంచం మొత్తం మీద 60 దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అయితే అందరి చూపు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైనా భారత్ మీదే ఉందన్నారు. యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు కళాశాలల యాజమాన్యాల సహకారం తీసుకున్నామని, అందుకే ఇంతస్థాయిలో ఓటర్లుగా నమోదయ్యారన్నారు. లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సహకారం చాలాగొప్పదని కొనియాడారు. అనంతరం ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, ఎస్పీ తుషార్ డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, లెట్స్ ఓట్ సంస్థ కన్వీనర్ మాల కొండయ్యలు జెండా ఊపి 3 కే ర్యాలీని ప్రారంభించారు. ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్‌ఓ పెద్ది రోజా, లెట్స్ ఓట్ సంస్థ గుంటూరు చాప్టర్ కో–ఆర్డినేటర్ టి.బాలాజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.




ర్యాలీలో వీవీఐటీ విద్యాసంస్థల చైర్మన్ విద్యాసాగర్‌రావు, విద్యార్థులు

- ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలోనూ, 18–19 ఏళ్ల వయస్సున్న తొలిసారి ఓటు హక్కు పొందినవారి కోసం ప్రారంభించిన 3కే వాక్‌లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. తప్పకుండా ఓటు వేస్తామని చెబుతున్నారు.

### మే 13 ఎప్పుడొస్తుందా అని..



పదేళ్ల క్రితంతో పోలిస్తే యువతలో ఎన్నికలపై ఆసక్తి పెరిగింది. నేను తొలిసారి ఓటు హక్కు పొందాను. హక్కు అనేకంటే బాధ్యత అనడం సబబుగా అనిపిస్తుంది. మే 13 ఎప్పుడొస్తుందా, ఎప్పుడు ఓటు వేద్దామా అని ఎదురు చూస్తున్నాను. నాతో పాటు ఓటు హక్కు ఉన్న నా స్నేహితులను కూడా ఓటేసేందుకు తీసుకెళ్తాను.

– పి.ప్రగ్న, బీటెక్ విద్యార్థిని

### భవిష్యత్తుకు భరోసా ఇచ్చే వారికే..



నా కులం వ్యక్తికో, ప్రాంతం వ్యక్తికో ఓటు వేయను. తొలిసారి ఓటు వేస్తున్న నేను అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తాను. మా భవిష్యత్తుకు, దేశానికి ఎవరు భరోసా ఇస్తారో వారికే ఓటు వేస్తాను. మా కాలేజీ యాజమాన్యం చొరవతోనే ఓటు హక్కు వచ్చింది.

– జి.లోకేష్, బీటెక్ విద్యార్థి

# సజావుగా పాలిసెట్

**జిల్లాలో 84.98 శాతం హాజరు**



**గుంటూరు ఎడ్యుకేషన్:** పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై శనివారం నిర్వహించిన పాలిసెట్–2024 గుంటూరు జిల్లాలో సజావుగా జరిగింది. గుంటూరు నగరం, తెనాలిలో ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాశారు. గుంటూరులో 11 పరీక్ష కేంద్రాలు, తెనాలిలోని మూడు కేంద్రాల పరిధిలో కేటాయించిన 5,407 మంది విద్యార్థుల్లో 4,595 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థుల హాజరు 84.98 శాతంగా నమోదైంది. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో ముందస్తుగా చేసిన ఏర్పాట్లతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదని పాలిసెట్–2024 గుంటూరు జిల్లా సమన్వయ కర్త తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు.

# చెయ్యి తీసేస్తా..

- అమెరికాలో అయితే కాల్చేస్తారు
- సద్దాం హుస్సేన్ కి పట్టిన గతే పడుతుంది
- ఇది అమెరికా నుంచి దిగుమతి అయిన టీడీపీ ఎంపీ అభ్యర్థి నోటి దురుసుతనం
- డబ్బుందన్న అహం ఎక్కువ ఉందంటున్న దేశం నేతలు

**సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'కొట్టడం అనేది ఎగ్జైస్ట్ ది లా... పొరపాటున ఎవడైనా చేస్తే ఏదో ఒక రోజు నాకు టైం వస్తుంది. కొట్టినవాడి చెయ్యి తీసేస్తా.. ఎవడైతే చేశాడో.. ఏదో ఒకరోజు ఐదేళ్లకో, పదేళ్లకో, పదిహేనేళ్లకో.. వాడు ఎంత చేస్తే అంతకు డబుల్ చేస్తా....' 'ఇదే అమెరికాలో అయితే కాల్చేస్తారు... ' 'వైఎస్సార్ సీపీ నాయకులు సద్దాం హుస్సేన్‌లా వ్యవహరిస్తున్నారు. సద్దాం హుస్సేన్ కూడా తన ఇష్టారీతిగా వ్యవహరించినందునే బంకర్‌లో దాగి ఉన్నా లాక్కొచ్చి కుక్కను కొట్టినట్లు కొట్టి చంపారు.'**
పై వ్యాఖ్యలు ఎవరో రౌడీనో, గుండానో, చదువుకోని వ్యక్తో చేసినవి కాదు. డాక్టర్ చదివి అమెరికాలో వ్యాపారాలు చేసి గుంటూరు తెలుగుదేశం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ పలు సందర్భాలలో చేసినవి. రెండు రోజుల క్రితం ఒక పచ్చ మీడియా అధినేతతో జరిగిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఒక వేళ మీపై కేసులు పెడితే, కొడితే ఏం చేస్తారు అని ప్రశ్నిస్తే తనను కొట్టడం చట్టానికి విరుద్ధం అని చెబుతూనే తనను కొట్టిన వారిని మాత్రం చెయ్యి తీసేస్తానంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం గమనార్హం. దేశంలోనే అత్యంత ధనవంతుడిగా పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగిన చంద్రశేఖర్ మొదటి నుంచి డబ్బుందన్న అహంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని సొంత పార్టీ నేతలే వాపోతున్నారు. చంద్రశేఖర్ అనాలోచితంగా చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి చేటు తెస్తున్నాయని వారు అంటున్నారు.

- ఇప్పటికే ఆయన తీరుపై కాపు సామాజిక వర్గం నేతలు అసంతృప్తిగా ఉన్నారు. ఆయన గుంటూరు బరిలోకి దిగిన తర్వాత ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క కాపు వర్గం నేతకు కూడా సీటు దక్కలేదు. అయినా పార్టీ కోసం పనిచేయడానికి వెళ్లిన వారికి ఛీత్కారాలే ఎదురయ్యాయి. తమ పార్టీతో పాటు మిత్రపక్షాలలో ఉన్న కాపు నేతలు కూడా కూటమికి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. ఇటీవల కాలంలో బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ స్టేట్ కో–కన్వీనర్ డాక్టర్ టి.వి.రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు పార్టీని వీడారు. మరికొంత మంది పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు.
- అమెరికాలో రూ.వందల కోట్లు సంపాదించి గుంటూరులో రాజకీయం చేయాలని డిసైడైన చంద్రశేఖర్ కనీసం నియోజకవర్గానికి ఏం చేస్తాడో కూడా చెప్పడం లేదు. తాను గెలిచిన తర్వాత అభివృద్ధి చేసి చూపిస్తానని చెబుతున్నాడు. 2014, 2019 ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ టిక్కెట్ కోసం ప్రయత్నించిన చంద్రశేఖర్, అనుకోని పరిస్థితుల్లో 2024లో గుంటూరు పార్లమెంట్ నుంచి బరిలోకి దిగారు. గెలిస్తేనే ఇక్కడ ఉంటారని, ఓడిపోతే తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోతారని తెలుగుదేశం నేతలు అభిప్రాయపడుతున్నారు. 2014, 2019లో చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన గల్లా జయదేవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గానికి సేవ చేయకపోగా చివరి నాలుగు సంవత్సరాలు అసలు కనపడకుండా పోయాడు. వరసగా రెండుసార్లు గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి విజయం సాధించినా గల్లా ప్రజలకు చేసిందేమి లేదనే చెప్పాలి. మొదటిసారి 2014లో ఇంటికో ఉద్యోగం వచ్చేలా చేస్తానని, 2019లో తన పరిశ్రమలను గుంటూరు చుట్టుపక్కల స్థాపించి ఉద్యోగాలు ఇప్పిస్తానని హామీలు గుప్పించారు. హామీలు అమలు చేయకపోగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యాపారాలు చూసుకున్నారు. తన వద్ద డబ్బు ఉంది కాబట్టి డబ్బు కుమ్మరించి గెలవగలననే ధీమా పెమ్మసాని వ్యక్తం చేస్తున్నారు. తనకు భారీ మెజారిటీ వస్తుందంటూ ప్రగల్భాలు పలుకుతుండటం, నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతుండటంతో అసలుకే ఎసరు వస్తుందన్న భయం తెలుగుదేశం నేతల్లో కనపడుతోంది.

## క్లుప్తంగా

### అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు సీఎం వైఎస్ జగన్ కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ గతేడాది జూన్ 7వ తేదీన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో భాగంగా 3,545 మంది కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. అయితే వివిధ శాఖల్లో క్రమబద్ధీకరణ జరుగగా, ఒక్క విద్యాశాఖలోనే ఉన్నతాధికారుల వైఖరితో కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ నిలిచిపోయిందన్నారు. గత మార్చి నెలలో వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించిన అధికారులు, విద్యాశాఖలో ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారని తెలిపారు. ప్రభుత్వ పరంగా ముఖ్యమంత్రి స్థాయిలో కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, అధికారుల లోపభూయిష్ట విధానాలతో అన్యాయం జరిగిందన్నారు. వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి, న్యాయం చేస్తామని తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఇచ్చారని తెలిపారు.

### ఏపీజీఎల్ఐపై అపోహలు తగవు

కార్యాలయ సూపరింటెండెంట్ పోతురాజు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీజీఎల్ఐపై ఉపాధ్యాయులు అపోహలు తగవని ఏపీజీఎల్ఐ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.పోతురాజు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో శనివారం 'ఏపీజీఎల్ఐ–ఆన్‌లైన్ సేవలు' అనే అంశంపై యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోతురాజు మాట్లాడుతూ ఆన్‌లైన్ విధానంలో వివిధ రకాల దరఖాస్తులను పంపే విధానాన్ని వివరించారు. ప్రతి ఉద్యోగి తమ ఖాతాలను పరిశీలన చేసుకుని, ఏవైనా లోపాలు తలెత్తితే సవరించుకోవాలని సూచించారు. ఏపీజీఎల్ఐ ద్వారా ఉద్యోగి తనకు సంబంధించిన సమాచారాన్ని చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ ఆదినారాయణ, జి. వెంకటేశ్వరరావు, కె. కేదార్నాథ్, ఎం. కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్, కె. ప్రభుజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగనన్న అంటే.. ఒక నమ్మకం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ, జనసేన నుంచి 500 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి రజిని

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటే నమ్మకానికి కేరాఫ్ అడ్రస్ అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక శ్యామలానగర్‌లోని మంత్రి నివాసంలో టీడీపీ, జనసేనల నుంచి 500 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా అన్ని వర్గాల పేదలకు మేలు చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, అందుకే పేదలంతా వెల్లువలా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. తొలుత కాటుమాల బాబూరావు ఆధ్వర్యంలో 34వ డివిజన్ ఫాతిమాపురానికి చెందిన సుమారు వంద మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సుబ్బారావు, వెంకటనర్సయ్య, తారక్, సతీష్, వెంకట్రావు, నాగరాజు, సురేష్, గౌతమ్, భాగ్యరాజు, వెంకట సుబ్బమ్మ, యోగేశ్వరమ్మ, గౌసియా, ఖాజాబీ, శాంతి, జెస్సీ, అన్నపూర్ణమ్మ మస్తానమ్మ, బుజ్జి, ఆదిలక్ష్మి, పాపాయి, మీనా, జయమ్మ, భవాని, సరోజిని, భవానీ ఉన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వినాయకరావు పాల్గొన్నారు. 18 డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు నిమ్మల వెంకట రమణ, చేగువేరా ఆధ్వర్యంలో మస్తాన్‌వలి దర్గా ప్రాంతానికి చెందిన జనసేన కార్యకర్తలు 150 మంది చేరారు. పార్టీలో చేరిన వారిలో దళవాయి అనిల్, బండారు ప్రభు, షేక్ మస్తాన్ , హరీష్, డి.రామకృష్ణ, మున్నా, కోటేశ్వరి, పద్మ, స్రవంతి, కృష్ణవేణి, స్వప్న, స్వర్ణ తదితరులు ఉన్నారు. అదే డివిజన్‌లో కుమారస్వామి, కల పాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టంశెట్టి వెంకటేశ్వర కాలనీకి చెందిన వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. 44వ డివిజన్‌లో పార్టీ నాయకుడు వంగల వలివీరారెడ్డి నాయకత్వంలో గౌతమినగర్‌లో శ్యామ్, కరుణాకర్, రోహిణి ఆధ్వర్యంలో 50 మంది చేరారు. అదే డివిజన్‌లో పేరం చంటి ఆధ్వర్యంలో మరికొందరు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరిని మంత్రి విడదల రజిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## సీఎం వైఎస్ జగన్ పాలనలో పెత్తందారీ వ్యవస్థ భూస్థాపితం

- రేపు సీఎం వైఎస్ జగన్ సభను విజయవంతం చేయాలి
- పొన్నూరు ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్యే ఆర్కే



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), వేదికపై అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్లుగా ఈ ఎన్నికలు పెత్తందార్లు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధమని, అది కచ్చితంగా పొన్నూరుకు సరిపోతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో శనివారం సమావేశం నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొని సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం సభలో ఆర్కే మాట్లాడుతూ పాడిరైతుల, పేదల కష్టార్జితాన్ని అక్రమంగా, అన్యాయంగా వేల కోట్లు ధూళిపాళ్ల నరేంద్ర దోచుకుంటున్నారని ఆరోపించారు. కుల అహంకారంతో రెచ్చిపోతున్న టీడీపీ, బీజేపీతో జతకట్టి పెత్తందార్ల పార్టీగా టీడీపీ అవతరించిందని, ఆ పెత్తందార్ల పార్టీకి ప్రతినిధులుగా నరేంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్ వచ్చారని పేదలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. జగనన్న అండదండలతో పేద, మధ్యతరగతి ప్రజలందరూ 2019లో కిలారి వెంకట రోశయ్యను గెలిపించుకుని సామాన్యుల నియోజకవర్గంగా రుజువు చేసుకున్నారని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం చేరువకావడం కోసం రానున్న ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.

**రేపు సీఎం బహిరంగ సభ**

అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన పొన్నూరుకు రానున్నారని, ఆయన పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో ఆశాజనకంగా ఉందని, ఆ మేనిఫెస్టోలోని అంశాలను ప్రతి ఇంటిలో ప్రజలకు వివరించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన పాలనలో ప్రజలు చెప్పుకోదగిన ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. 2014 ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం హెలిపాడ్ స్థలాన్ని అంబటి మురళీకృష్ణ నాయకులతో కలసి పరిశీలించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమోహన్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎంఏ మహమూద్, ఆదిశేషులు, నాయకులు బొనిగల వేణుప్రసాద్, వడ్రాణం ప్రసాద్, షేక్. నాజర్, దాసరి నారాయణరావు, ఎండేటి వెంకట సుబ్బయ్య, అల్లాబాషు పాల్గొన్నారు.

## విద్యార్థులను సమాజ సేవకులుగా తీర్చిదిద్దాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న సురేష్ కుమార్

తాడికొండ: జాతీయ సమైక్యత కోసం, సేవా భావంతో దేశానికి సేవ చేసేందుకు, మానవత్వం పెంపొందించేందుకు, సమగ్రాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ చీఫ్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ కోరారు. గుంటూరు జిల్లా తాడికొండలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రీజనల్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు, స్కౌట్స్ రెసిడెన్షియల్ క్యాంపు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసం ఉండేందుకు కర్రలతో తయారు చేసిన టెంట్‌లు, గాడ్జెట్లు, ఫస్ట్ ఎయిడ్‌లో బ్యాండేజ్ కట్లు కట్టడం స్ట్రక్చర్ నిర్మాణం, తాళ్లతో వేసే ముడులు, మ్యాపింగ్ స్టార్గేజింగ్, ఎస్టిమేషన్, సిగ్నలింగ్, ప్రాక్టికల్ చేయడం వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ మొదలు పెట్టాలని, దీని ద్వారా విద్యార్థులు లైఫ్ స్కిల్స్ నేర్చుకొని క్రమశిక్షణతో మెలగడంతో పాటు విద్యార్థి దశ నుంచే ప్రజలకు సేవచేయాలనే దృక్పథాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం స్కౌట్స్ ఉపాధ్యాయులు సరైన శిక్షణ అందించి మన రాష్ట్రాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రత్యేక స్థానంలో నిలబెట్టాలని కోరారు. రాష్ట్రంలోని క్యాంపు సైట్లను, తాడికొండ రీజనల్ ట్రెనింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ నెల 24 నుంచి కొనసాగుతున్న క్యాంపు 29వ తేదీతో ముగియనుంది. ఈ క్యాంపునకు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 138 మంది విద్యార్థులు, 7 మంది స్కౌట్ ఎగ్జామినర్‌లు పాల్గొన్నారు. ఆయన వెంట డైరెక్టర్ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కమిషనర్ రేంజర్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పయ్యావుల పార్వతి, జిల్లా విద్యా శాఖాధికారి, జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శైలజ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఎస్ఓసీ షేక్ నజీర్, జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, క్యాంప్ ఆఫీసర్ దారం ప్రసాద్ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

గుంటూరు లోక్‌సభ అభ్యర్థి రోశయ్య



వాకర్స్‌తో మాట్లాడుతున్న కిలారి రోశయ్య

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గుంటూరు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం పర్యటించారు. గ్రౌండ్స్‌లో వాకర్స్‌తో కలసి వాకింగ్ చేస్తూ.. వారితో ముచ్చటించారు. విశ్రాంత ఉద్యోగులతో కలసి తిరుగుతూ.. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని రోశయ్య కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో, పేదవర్గాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని, వారికి అన్ని విధాలుగా మేలు చేకూరుస్తున్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తారన్నారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా నిలబడుతున్న తనని, ఏడు నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

## నీటిగుంతలో పడి ఇద్దరు మృతి

పెదకూరపాడు: సరదగా ఈతకు వెళ్లి నీటి గుంతలో పడి ఇద్దరు మృతి చెందగా మరొకరిని స్థానికులు కాపాడారు. ఈ ఘటన పెదకూరపాడు మండలం కన్నెగండలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బత్తుల ప్రకాష్ సోదరి హేమమ్మ కుమారులు వేసవి సెలవులకు వచ్చారు. ఈ క్రమంలో చిన్నారులు ఆడుకుంటూ కాలనీకి కొంత దూరంలో ఉన్న అల్లిపరపు వాగు సమీపంలో ఉన్న నీటి గుంతలో ఈతకు ధనూష్ (13), వేణుగోపాల్(12), ప్రశాంత్ వెళ్లారు. నీటి గుంతలో దిగారు. ధనూష్, వేణుగోపాల్‌లు నీటిలో మునిగి పూడికలో కూరుకుపోయారు. ప్రశాంత్ బిగ్గరగా కేకలు వేయడంతో పక్కన గేదెల కాపర్లు వచ్చి కండువాల సహాయంతో కాపాడారు. పక్కనే క్రేన్‌తో పని చేస్తున్న షేక్ బాషా వెంటనే నీటి గుంతలో ఉన్న నీటిని తోడారు. ఇద్దరు పూడికలో కూరుపోవడంతో బయటకు తీశారు. అప్పటికే మృతి చెందారు. వేణుగోపాల్ కన్నెగండ్లలో ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి, ధనూష్, అబ్బూరులో 7వ తరగతి చదువుతున్నారు. ధనూష్‌ను స్వగ్రామమైన అబ్బూరుకు, వేణుగోపాల్‌ను స్వగ్రామమైన పెదకూరపాడుకు బంధులు, కుటుంబ సభ్యులు తరలించారు.

## దళితులను దూషించడం టీడీపీకి పరిపాటి

మాదిగ లాయర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పునులూరి జీవా



నెహ్రూనగర్: దళితులను దూషించడమే టీడీపీకి పరిపాటిగా మారిందని మాదిగ లాయర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పునులూరి జీవా పేర్కొన్నారు. ఈ మేరకు అంబేడ్కర్ భవన్ వద్దగల అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రత్తిపాడు తరుపున ఎన్నికల బరిలో ఉన్న బూర్ల రామాంజనేయులు ఎన్నికల ప్రచారంలో భాగంగా దళితులు గంజాయి తాగి, తల్లిదండ్రుల మెడ మీద కత్తిపెట్టి గొంతులు కోస్తారని అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. స్వాతహాగా ఒక దళిత ఐఏఎస్ అయి ఉండి దళితులను ఈ విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. ఐఏఎస్ కావడం వలనే పేద వర్గాలను రానివ్వకుండా.. వారిపై చిన్న చూపుతూ వివక్ష చూపుతూ రామాంజనేయులకు దళితుల ఓట్లు వేయదగ్గ వ్యక్తా అని ప్రశ్నించారు. అదే విధంగా దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఒక దళితుడిపై చేసిన దాష్టీకం చేయడం, భువనేశ్వరీ దళితులను కించపరిచే విధంగా హేయమైన భాష మాట్లాడటం చూస్తుంటే దళితులంటే టీడీపీకి ఎంత చిన్నచూపో అర్థమవుతుందన్నారు. దళితులంటే ఇంత చులకన చూస్తున్న టీడీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞత కలిగిన మాదిగలకు విన్నవించారు.